డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- భూపాలపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి


ఓటు అభ్యర్థిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: బీజేపీ ద్వారానే అన్ని వర్గాల వారికి లాభం చేకూరుతుందని అభివృద్ధి, సంక్షేమం, డబుల్ ఇంజన్ సర్కార్ వల్లనే సాధ్యమవుతుదని భూపాలపల్లి బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కీర్తిరెడ్డి ఓట్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా షాపుల యజమానులు కీర్తిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తమ నిధులుగా చెప్పుకుంటుందని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను మోసగించిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీజేపీ కమలం గుర్తుకు ఓట్లు వేసి ఆదరించాలని కీర్తిరెడ్డి వేడుకున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఓటర్లంతా బీజేపీ వైపు నిలుస్తున్నారన్నారు. కాంగ్రెస్ బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. సుస్థిర పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. రైతును రాజు చేయడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గెలిచిన తర్వాత భూపాలపల్లికి ఇంజనీరింగ్, మైనింగ్ కళాశాలలతో పాటు, రైల్వేలైన్ తెప్పిస్తానన్నారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌కుమార్, అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు రాజేందర్, మండల రఘునాథరెడ్డి, విష్ణు పాల్గొన్నారు. బూత్ నాయకులు, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ అభివృద్ధికి అవకాశం ఇవ్వండి


ఓటెయ్యాలని కొంగుపట్టి అడుగుతున్న షాలిని


కమలాపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

- బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/జమ్మికుంట/కమలాపూర్: హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. హుజూరాబాద్‌లో సోమవారం రోడ్ షో నిర్వహించారు. పదిహేనేళ్లుగా ప్రజాసేవలో ఉంటున్నానని, సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. హుజూరాబాద్ అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్ల నిధులు తేవడంతో పాటు నాలుగు కొత్త మండలాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేసుకున్నామని, మినీస్టేడియం పనులు జరుగుతున్నాయని తెలిపారు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడినా ప్రజల మధ్యలో ఉంటూ సేవ చేస్తూనే ఉన్నాం ఈ సారి కౌశిక్‌రెడ్డికి ఓటేసి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి సతీమణి షాలిని కంటతడి పెడుతూ అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. దండం పెట్టి అడుగుతున్న మా డాడీకి అవకాశం ఇవ్వండి ప్లీజ్.. అంటూ కౌశిక్‌రెడ్డి కూతురు శ్రీనిక వేడుకున్నారు. హుజూరాబాద్‌ను హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చేయాలనేది డాడీ కల అని, ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే హుజూరాబాద్ అభివృద్ధికి నిధులు తేవడానికి ఒత్తిడి తెస్తానన్నారు.

ఇంటింటి ప్రచారం

జమ్మికుంట పట్టణంలోని 21 వార్డులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం మద్దతుగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఖదీర్, శ్రీకాంత్, రుస్తుం, జాన్, వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమపాలన

పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి కోరారు. కమలాపూర్, శనిగరం గ్రామాల్లో కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ సుస్థిరపాలన అందిస్తున్న కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించి గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమపాలన అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, నాయకులు మొటం అశోక్, సాంబయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కే యాదవుల మద్దతు

ఐనవోలు: బీఆర్‌ఎస్ పార్టీకే యాదవుల మద్దతు ఉంటుందని జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు అన్నారు. ఆదివారం నందనం గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు తోటకూరి సోమయ్యకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బలవంతంగా కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల యాదగిరి, బుర్ర రాజశేఖర్, జున్ను లవణ్, మరుపట్ల దేవదాస్, నర్సింగం, యాదగిరి, కుమారస్వామి, రాములు, ఎల్లయ్య, అనిల్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్‌లు జనగాని మంజులసత్యనారాయణ, మంద రాజయ్య, ఉపసర్పంచ్ కటకం రాజ్‌కుమార్, వార్డు సభ్యురాలు గాజర్ల రమసదయ్యతో పాటు 25మంది సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆపార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు.

ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరినట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ తెలిపారు. వారికి వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజు కండువా కప్పి ఆహ్వానించారు. ఒంటిమామిడిపల్లి మాజీ సర్పంచ్ మేరుగు రాజేశ్వర్‌గౌడ్, కొనకటి శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రలోభాలకు లొంగొద్దు

వేలేరు : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని స్థానిక ఎస్సై హరిత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

శాయంపేట : ఈనెల 30వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ మల్లేష్ అన్నారు. మండలంలోని గోవిందాపూర్, మాందారిపేట, సూరంపేట, గట్లకానిపర్తి గ్రామాల్లో సోమవారం బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ బలగాలతో ఎస్సై దేవేందర్ సిబ్బందితో కలసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. గొడవలు సృష్టించిన కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నడుచుకోవాల్సి ఉంటుందని, అందరూ గమనించాలని కోరారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన

ఎల్కతుర్తి: గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (ఆర్‌ఏడబ్ల్యూఈపీ)లో భాగాంగా సోమవారం మండలంలోని దామెరలో ఎస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు తేనెటీగల పెంపకం, పెట్టుబడి, రాబడి వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. అగ్రికల్చర్ అధ్యాపకులు సీహెచ్ సుచిత్‌కుమార్, డాక్టర్ రాథోడ్‌లాల్‌సింగ్ మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకం తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడితో కూడిన వ్యవసాయ అనుబంధ వ్యవస్థ అని, దీని వలన తేనె మాత్రమే కాకుండా అనేక తేనెటీగ సంబంధిత పదార్థాలు రాబట్టుకోవచ్చని అన్నారు. తేనెటీగలు చేసే పరాగ సంపర్గం ద్వారా పంట ఉత్పత్తి కూడా పెంచుకోవచ్చని రైతులకు వివరించారు. సర్పంచ్ చల్లా రవీందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, రైతులు, విద్యార్థులు లయ, సుష్మిత, అమృత, శర్వాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే..


మాట్లాడుతున్న సతీశ్‌కుమార్


నాయకులు బహూకరించిన నాగలితో సతీశ్‌కుమార్

- హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): మూడోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని శనిగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని.. అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేశారని కొనియాడారు. ఉద్యమ సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు హేళన చేశాయన్నారు. వారి మాటలు నమ్మి ఓట్లు వేస్తే రాష్ట్రం అభివృద్ధికి దూరం అవుతుందని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న శనిగరం ప్రాజెక్టును పునరుద్ధరించి కోహెడ, బెజ్జంకి మండలాలకు సాగు నీరు అందించామని తెలిపారు. తెలంగాణలో ఎవరు ఎన్ని కుట్రలు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ నాగరాజు, శ్యామల మధుసూదన్, రాష్ట్ర నాయకులు శ్రీహరి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల మహేందర్ పాల్గొన్నారు.

మూడోసారి ఆశీర్వదించండి..

హుస్నాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని రాష్ట్ర టీవీ, చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్, ఎన్నారై బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్మాచలం అనిల్ అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎన్నారై విభాగం ఎన్నికల్లో కాకుండా తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వెంట ఉండి క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను రెండుసార్లు ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారని.. మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నారై (యూకే) బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఎన్నారై (బహరేన్) బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్, ఎన్నారైలు లక్ష్మారెడ్డి, ఇసంపల్లి రమేశ్, మధుయాదవ్, రాజ్‌కుమార్, ప్రవీణ్ పంతులు, దూస గణేశ్ ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు

చిగురుమామిడి: హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తామని మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. చిగురుమామిడిలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ రజిత పాల్గొన్నారు

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలవి పగటి కలలే


పరకాల : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి


పరకాల: ప్రచారంలో భాగంగా చల్లా జ్యోతికి బొట్టుపెడుతున్న మహిళ

- బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి 'చల్లా'
- అధికారంలోకి రానున్నది బీఆర్‌ఎస్సే
- నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..

పరకాల : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తామని కాంగ్రెస్, బీజేపీ పగటి కలలు కంటున్నాయని, రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయం సాధించేది బీఆర్‌ఎస్ పార్టీయేనని బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. డిసెంబర్ 3వ తేదీ తర్వాత కాంగ్రెస్, బీజేపీ కనిపించకుండా పోవడం ఖాయమన్నారు. టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సొంత పార్టీ కార్యకర్తలను ఓర్వలేని రేవూరి ప్రకాశ్‌రెడ్డి.. మూడుసార్లు ఓడిపోయినా మళ్లీ ఏందుకు పోటీ చేస్తున్నారో ఆయనకే తెలియాలన్నారు. తన ఎదుగుదలను అడ్డుకున్న రేవూరికి నియోజకవర్గ ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్, 100 పడకాల ఆస్పత్రి నిర్మాణంతో పాటు కొత్త మున్సిపల్ భవనం, రూ.13 కోట్లతో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు తీసుకొచ్చి ప్రజల కోరిక నెరవేర్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిన పరకాల అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులే తన గెలుపు కోసం తిరుగుతున్నారన్న ఆయన.. 10 ఏళ్ల కాలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణం ప్రశాంతంగా ఉందన్నారు. నియోజకవర్గంలో తాను మట్టి దందా చేస్తున్నానని ఆరోపిస్తున్నా రేవూరి ప్రకాశ్‌రెడ్డి.. తాను ప్రభుత్వ అనుమతులు తీసుకొని పనులు చేస్తున్న విషయాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు. బీఆర్‌ఎస్‌లో చేరికలతో బీజేపీ ఖాళీ అవుతోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మోసపూరిత మాటలు నమ్మొద్దని, బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, నాయకులు సోదా రామకృష్ణ, నిప్పాని సత్యనారయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, పరకాల, మాదారం పీఏసీఎస్ చైర్మన్లు నాగయ్య, లింగమూర్తి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధే 'చల్లా' ఎజెండా

పరకాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మూడోసారి గెలిపించాలని ఆయన సతీమణి చల్లా జ్యోతి ఓటర్లను కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 4,19, 22 వార్డుల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాడవాడకు తిరుగుతూ మోడల్ ఈవీఎంలో కారు గుర్తును చూపిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు. స్థానిక మహిళ ఓటర్లు ఆమెకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చల్లా ధర్మారెడ్డిని గెలిపించాలి


ఆత్మకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, సోల్తి భూమాత కోరారు. ఈమేరకు నగరంలోని 17వ డివిజన్ గాడిపల్లిలో కార్పొరేటర్ గద్దె బాబు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి చల్లా ధర్మారెడ్డిని గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. దామోదర్, సోల్తి నరేందర్, జంపాల రాంబాబు, సదానందం, శ్యామ్, మధు తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ ఖాయం

ఆత్మకూరు : బీఆర్‌ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపు ఖాయమని పట్టణ అధ్యక్షుడు పావని రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి ధర్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

అంగరంగ వైభవంగా కార్తీకపౌర్ణమి వేడుకలు


వేలేరు : శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా కర్తీకపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పరకాల పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని శ్రీ వీరభద్రస్వామి, భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం, వేలేరు మండలంలోని పీచర మల్లికార్జునస్వామి ఆలయం, కమలాపూర్ శివాలయంలో వేడుకలు అంబరాన్నంటాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. పలు ఆలయాలు విద్యుత్ కాంతులతో జిగేల్‌మన్నాయి.

- సాక్షి నెట్‌వర్క్


ఎల్కతుర్తిలో..


కమలాపూర్‌లో..


ఐనవోలులో..

అభివృద్ధిని చూసి ఓటేయండి


రేగొండ: సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ: భూపాలపల్లిలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాజక్కపల్లి, విజ్జయ్యపల్లి, చిన్నకోడేపాక, బాలయ్యపల్లి, దామరంచపల్లి, చెన్నాపూర్, రూపిరెడ్డిపల్లి, తిరుమలగిరి, జూబ్లీనగర్, రామన్నగూడెం తండా, కొడవటంచ గ్రామాల్లో ఎమ్మెల్యే బస్సురాజు సాయిఖ్యతో కలిసి ప్రజా ఆశీర్వాద యాత్ర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. భూపాలపల్లిలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నదని అన్నారు. పల్లెలు, పట్టణాలను సమగ్రంగా అభివృద్ధి చేసిన పార్టీకి ప్రజలంతా అండగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సాయిని విజయ, మండల అధ్యక్షుడు మటిక సంతోష్, అంకం రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు జిల్లా నాయకుడు ఉమేష్ గౌడ్, సర్పంచ్‌లు పాతపల్లి సంతోష్, చందు, ఐలయ్య, నీలా, ప్రణతి ఎంపీటీసీలు ఐలి శ్రీధర్, హామీద్, కవితసామ్రాట్, రమేష్ నాయకులు బండి కిరణ్, నీలాంబరం, అమ్ముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం నిర్వహించిన నాయకులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో సోమవారం భూపాలపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన గండ్ర వెంకటరమణారెడ్డిని మళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటె ధర్మారావు, పీఏసీఎస్ చైర్మన్ హసంపెల్లి నర్సింగరావు, నాయకులు ఎలేటి నర్సింహారెడ్డి, లడె రాజేందర్, శ్రీనివాస్, జనార్దన్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు

బీఆర్‌ఎస్ బైక్ ర్యాలీ

చిట్యాల: భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకట రమణారెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతలు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు వీధుల్లో తిరిగి గండ్ర వెంకటరమణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు కొత్తూరి రాజిరెడ్డి, కట్కూరి నరేందర్, పాండ్రాల స్వామి, ఆరెపల్లి సమ్మయ్య, కట్కూరి రాజేందర్, పెరుమాండ్ల రవీందర్ గౌడ్, గుర్రపు తిరుపతి గౌడ్, తాటం నవీన్, బుర్ర శ్రీధర్, కనకం తిరుపతి, ముసాపూరి రవీందర్, మొలుగూరి రాకేష్‌తో పాటు ఆ పార్టీ నాయకులు, అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


చిట్యాల: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గ్రీన్‌ఫీల్డ్ బాధితుల విస్తృత ప్రచారం


ఓటు అభ్యర్థిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ బాధిత రైతులు

పరకాల: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన గ్రీన్‌ఫీల్డ్ బాధిత రైతులు (స్వతంత్ర అభ్యర్థులు) పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న వ్యాపారస్తులను ఓట్లు అభ్యర్థించారు. తమ భూములను ఏకపక్షంగా స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ ఏనిమిది మంది రైతులు నామినేషన్ వేయగా రెండు నామినేషన్లు చెల్లుబాటు కాకపోవడంతో మిగతా ఆరుగురు బరిలో ఉన్న విషయం తెలిసిందే. గ్రీన్‌ఫీల్డ్ హైవే రద్దు చేసి గ్రీన్‌ఫీల్డ్‌ను బ్రౌన్ ఫీల్డ్‌గా మార్చాలనే డిమాండ్‌తో పోరాటాలు చేసినా పాలకులు పట్టించుకోకపోవడంతో తాము ఎన్నికల బరిలో నిలవాల్సి వచ్చిందని, తమకు ఓటు వేసి గెలిపించాలని గ్రీన్‌ఫీల్డ్ బాధిత రైతు, స్వతంత్ర అభ్యర్థి గోనె రాజు అన్నారు.